
www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

మంగళవారం 20 మే 2025

విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



# కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు

## ఐదో రోజు సరస్వతీ పుష్కరాలు

- భక్తజనంతో కిక్కిరిసిన వీధులు
- తిప్పలు పడుతున్న భక్తులు

అరకొర వసతులతో అవస్థలు

**కలంజ్యోతి, జయశంకర్ భూపాలపల్లి:** కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు ఐదో రోజుకు చేరుకున్నాయి. సోమవారం సందర్భంగా కాళేశ్వర క్షేత్రానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు చేసి సైకత లింగాలకు పూజలు చేస్తున్నారు. కాళేశ్వర ముక్తేశ్వరుడు, శుభానంద దేవిని దర్శించుకునేందుకు బారులు తీరారు. రద్దీకి తగిన విధంగా ఏర్పాట్లు లేకపోవడంతో భక్తుల ఇబ్బందులు తప్పడం లేదు. పుష్కర ఘాట్ల వద్ద స్నానాలు చేయడానికి, దుస్తులు మార్చుకోవడానికి మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక దర్శనాలకోసం క్యూ లైన్లలో భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరిగిపోతుండడంతో కాళేశ్వరం క్షేత్రంలో వీధులన్నీ సందడిగా మారాయి. భక్తుల రద్దీ పెరగడంతో మహాదేవపూర్ నుంచి కాళేశ్వరం దాకా ట్రాఫిక్ సుమారు 10 గంటల పాటు స్తంభించి పోయింది. దాదాపు 16 కిలోమీటర్ల మేర ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు.

**పోటెత్తిన భక్తజనం**

పుష్కరాల్లో భాగంగా భక్తులు పోటెత్తారు. ఉద్యోగులు, ఇతర రాష్ట్రాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు రెండు లక్షల మంది వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం ట్రాఫిక్ జామ్ కావడంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధ, సినీ నటుడు రాజేంద్రప్రసాద్ పుష్కర స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన హెలికాప్టర్ జాయ్ రైడింగ్‌ను కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించి ఏరియల్ సర్వే చేశారు.

### పుష్కరాల్లో భక్తులకు తప్పని తిప్పలు

కాళేశ్వరంలో సర్వస్వతీ పుష్కరాల నిర్వహణ సరిగా లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధర్మదర్శనం కోసం నిలబడిన భక్తుల క్యూలైన్ ఎంతకూ కదలకపోవడం.. అధికారి పార్టీ నాయకులు తమ అనుచరులు, బంధువులకు నేరుగా గర్భగుడిలోకి తీసుకెళ్లి దర్శనం కల్పించడం వంటి చర్యలతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పోలీసులు కూడా అత్యుత్సాహాన్ని ప్రదర్శించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సహనం నశించిన భక్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. క్యూ లైన్‌లో నుంచి బయటికి వచ్చి తోసుకుంటూ ప్రధాన ద్వారం ద్వారా గర్భగుడిలోకి చొచ్చుకెళ్లారు. ఈ క్రమంలో పోలీసులు మిగిలిన వారిని అడ్డుకుని క్యూలైన్ ద్వారా పంపారు. తోపులాటలో పలువురు చిన్నారులు, వృద్ధులు సొమ్మసిల్లి పడిపోయారు. ఆదివారం భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిసినా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా ఉదాసీనంగా వ్యవహరించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





## శరణార్థులకు ఆశ్రయం ఇవ్వలేం

- సుప్రీంకోర్టు సంచలన తీర్పు భారత్ ధర్మశాల కాదు
- శ్రీలంక శరణార్థుల పిటిషన్ కొట్టేసిన సుప్రీం
- తక్షణం శరణార్థులు భారత్‌ను వీడాలని ఆదేశం

**కలంజ్యోతి, న్యూఢిల్లీ:** శ్రీలంక శరణార్థుల అంశానికి సంబంధించి దాఖలైన పిటిషన్ పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. శ్రీలంక శరణార్థులు పిటిషన్‌ను సుప్రీం కొట్టివేసింది. ప్రపంచంలోని నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ ధర్మశాల కాదని స్పష్టం చేసింది. శ్రీలంక శరణార్థుల పిటిషన్‌పై సోమవారం ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. శరణార్థులకు భారత్‌లో స్థానం లేదని తేల్చి చెప్పింది. తక్షణమే దేశాన్ని వీడి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఇప్పటికే దేశంలో జనాభా 140 కోట్లకు పెరిగిందని.. ఈ జనాభాతోనే తాము సతమతమవుతున్నామని పేర్కొంది. వేరే ఏ దేశానికైనా వెళ్లిపోండి అని సూచనలు చేసింది. అన్ని ప్రాంతాల నుండి వచ్చే విదేశీ పౌరులకు ఆతిథ్యం ఇచ్చేందుకు ధర్మశాల కాదు. వెంటనే దేశంలోని శరణార్థులు దేశం విడిచి వెళ్లాలని జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారు.




## అహల్యా బాయి హోల్కర్ ను ఆదర్శంగా తీసుకోవాలి

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

**కలంజ్యోతి, నిర్మల్ :** రాణీ అహల్యా బాయి హోల్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ పిలుపునిచ్చారు. అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకను నిర్మల్ లో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొఘలుల కాలంలో ధ్వంసమైన హిందూ దేవాలయాల పరిరక్షణ లో రాణి హోల్కర్ పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. ఆమె తమ కాలంలో హిందూ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించి, హిందువులను సంఘటిత పరిచారన్నారు.ఆమె జీవిత చరిత్ర మనకు అత్యంత ప్రముఖమైనదిగా అభివర్ణించారు. అందుకే బీజేపీ పార్టీ హోల్కర్ 300వ జయంతి వేడుకలను దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రామ్ నాథ్, కార్యక్రమ జిల్లా కన్వీనర్ అలివేలు మంగ, రాష్ట్ర నాయకురాలు లలిత, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు వైద్య రజని, ముధోల్ కన్వీనర్ సీరం సుష్మారెడ్డి, ఖానాపూర్ కన్వీనర్ సత్యవతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి,తదితరులు పాల్గొన్నారు.



# నల్లమల్ల దేశానికి వెన్నెముక

- సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రాంత బిడ్డగా గర్వపడుతున్నా
- అభివృద్ధికి కృషి చేస్తా
- పోడుభూములు సాగు భూములు అయ్యాయి



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్:** పాలమూరు ప్రజలు కట్టినప్రాజెక్టులు నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. నల్లమల్ల నుంచి సీఎంగా మాట్లాడుతుంటేతన గుండె ఉప్పొంగుతోందనిచెప్పారు. నాగర్ కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం మాచారంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి సభా వేదికపై నల్లమల్ల డిక్లరేషన్‌ను, మంత్రులతో కలిసి ఆవిష్కరించారు. ఈ డిక్లరేషన్‌తో ఆదివాసీలు, బంజారాలు, చెంచులకు లబ్ధి చూకూర్చుతూ.. గిరిజన సంక్షేమానికి రూ.12,600 కోట్లు పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఒకప్పుడు నల్లమల్ల ప్రాంతం అంటేనే వెనుకబడిన ప్రాంతంగా పరిగణించేవారన్నారు. ఎక్కడి నుంచో నాయకుడు వచ్చి నల్లమల్లను అభివృద్ధి చేయాలనే వారని.. సీఎంగా నల్లమల్ల నుంచి మాట్లాడుతుంటే నా గుండె ఉప్పొంగిపోతోందన్నారు. పాలమూరు, నల్లమల్ల ప్రాంతవాసినని తాను గర్వంగా చెప్పుకుంటానని అన్నారు. దేశంలో ఎక్కడి ఏ ప్రాజెక్ట్ కట్టాలన్నా.. పాలమూరు వాళ్లనే పిలిచే వారనే గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి నిలబెట్టిన ఈ ప్రాంత రుణం తీర్చుకుంటామని హామీ ఇచ్చారు. నల్లమల్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాల్సిన అవసరం ఉందన్నారు. ఒప్పుడు పోడు భూములు.. పోరుభూములుగా మారాయన్నారు. ఇప్పుడే అవే భూములను తాము వ్యవసాయానికి అనుకూలంగా మారుస్తున్నామని తెలిపారు. సోలార్ విద్యుత్ మోటార్లతో పోడు భూములను వ్యవసాయ భూములుగా మార్చేందుకే 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని తీసుకొచ్చామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఆడబిడ్డలు సోలార్ విద్యుత్ ప్లాంట్లు పెట్టుకునే అవకాశం కల్పించాలన్నారు. రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపు సెట్లు ఇవ్వబోతున్నామని చెప్పారు. నల్లమల్ల ప్రాంతాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని సహచర మంతులను కోరుతున్నా అంటూ భట్టి అక్కడికి మంత్రులను ఉద్దేశించి కామెంట్ చేశారు. ప్రపంచానికే అచ్చంపేటను ఆదర్శంగా మారుస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ డిపోను సందర్శించిన సజ్జనార్

**కలం జ్యోతి, నిర్మల్:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎం డి సజ్జనార్ ఆదిలాబాద్ బస్ డిపోను సోమవారం సందర్శించారు. ఇందులో భాగంగా డిపో పరిధిలోని తిరుగుతున్న సర్వీసులు, ప్రయాణికులకు కల్పిస్తోన్న సౌకర్యాలు, తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్రైవర్లు, కండక్టర్లతో పాటు గ్యారేజీ సిబ్బందితో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పనితీరును ఆరా తీశారు. బస్ స్టేషన్ లో ఆర్టీసీ అందిస్తోన్న సేవలకు సంబంధించిన క్యూఆర్ కోడ్ తో కూడిన కీ చైన్‌లను ప్రయాణికులకు అందజేశారు.



కలంజ్యోతి 3
మంగళవారం 20.05.2025 General News



# అక్రమ కనెక్షన్ కారణమా?

- పాతబస్తీ ప్రమాదంపై విస్తుపోయే విషయాలు
- గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంపై విచారణ
- అక్రమ కరెంట్ కనెక్షన్లు వల్లే ప్రమాదం

**కలంజ్యోతి, హైదరాబాద్:** పాతబస్తీలోని గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదం వెనుక సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. అగ్నిప్రమాదం వెనక అక్రమ కరెంట్ కనెక్షన్ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ అక్రమ కరెంట్‌పై పోలీసులు, ఫైర్ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదం కారణంగా 17 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటన నగరాన్ని ఉలికిపాటుకు గురిచేసింది. ఈ నేపథ్యంలో ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. తాజాగా ఈ ఘటనకు సంబంధించిన పలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అక్రమ కరెంట్ కనెక్షన్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు, ఫైర్ సిబ్బంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**అక్రమ కనెక్షన్ వల్లే..**

నగల దుకాణం మూసేయగానే హై టెన్షన్ వైర్ నుంచి.. కొక్కేల ద్వారా స్థానికులు కరెంట్ కనెక్షన్ తీసుకున్నారు. ఈ అక్రమ కరెంట్‌తో బాధిత కుటుంబం కరెంట్ మీటర్‌పై లోడ్ పడింది. ఆ కరెంట్ లోడ్‌తో బాధిత కుటుంబం మీటర్ బాక్స్‌లో మంటలు చెలరేగాయి. మీటర్ బాక్స్ పక్కన ఉన్న ఉడెన్ షోకేజ్ కు మంటలు అంటుకున్నాయి. ఉడెన్ షోకేజ్ నుంచి ఏసీ కంప్రెషర్‌ను మంటలు తాకాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అక్రమ కరెంట్‌పై పోలీసులు, ఫైర్ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. ఈ అగ్ని ప్రమాదంలో 17 మంది చనిపోవడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు, నలుగురు మహిళలు, ఐదుగురు పురుషులున్నారు. అపస్మారక స్థితికి చేరిన నలుగురు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం కోలుకున్నారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అగ్నిమాపక శాఖ అధికారులు ప్రకటించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ముఖ్యమంత్రి ఆదేశించారు.

**అగ్నిప్రమాదంలో మరో ప్రాణం పోకుండా చూడాలి: కేటీఆర్**

అగ్ని ప్రమాద స్థలాన్ని కేటీఆర్ పరిశీలించారు. మంటలు వ్యాప్తి చెందిన ప్రదేశాన్ని పరిశీలించి అధికారులు, స్థానికులతో మాట్లాడారు. అనంతరం ఈ ప్రమాదంలో గాయాలతో బయటపడ్డ క్షతగాత్రులతో మాట్లాడారు. ఈ క్రమంలో తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన వారిని ఓదార్చారు. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదంలో బాధితులు సర్వం కోల్పోయారు. తెలంగాణ ప్రభుత్వం వారికి అండగా నిలుస్తూ.. ఐదు లక్షలు కాకుండా రూ. 25 లక్షలు పాతబస్తీలోని గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అవి వారి ఇంటిని, వ్యాపారాన్ని పున:నిర్మించుకోవడానికి ఉపయోగ పడుతాయని చెప్పారు.

# ‘ఆత్మ’ కమిటీలు రైతులకోసం పాటు పడాలి

- నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు



**కలంజ్యోతి, నిర్మల్ :** ఆత్మ కమిటీలు రైతు సంక్షేమం కోసం పనిచేయాలని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన రైతు కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్‌గా రామ్ రెడ్డి, 27 మంది డైరెక్టర్లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నలకు ఆధునిక పద్ధతుల గురించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆత్మ కమిటీపై ఉందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ప్రవేశ పెట్టిన రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బీమా, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మద్దతు ధరపై రూ. 500 బోనస్ వంటి పథకాలు రైతుల జీవితాలను మెరుగు పరుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీశైలం ఆలయం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పై సస్పెన్షన్ వేటు

- పది రోజుల క్రితం ఆలయానికి ఇతర మతస్థుల రాక
- వారి వద్ద లభ్యమైన అన్యమత పుస్తకాలు
- ఘటన వెలుగులోకి రావడంతో ఈవో చర్యలు

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్ఓ) అయ్యన్నపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎస్. శ్రీనివాసరావు సస్పెన్షన్ వేటు వేశారు. సీఎస్ఓగా ఉద్యోగ బాధ్యతల పట్ల అయ్యన్న నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో ఈవో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే, సుమారు పది రోజుల క్రితం, ఇతర మతాలకు చెందిన కొందరు వ్యక్తులు ఆలయ సందర్శన కోసం వచ్చారని తెలిసింది. ఆ సమయంలో వారి వద్ద అన్యమతానికి సంబంధించిన పుస్తకాలు ఉన్నట్లు క్యూ లైన్ల వద్ద భద్రతా సిబ్బంది గుర్తించారు. దీంతో సిబ్బంది వారిని అక్కడి నుంచి వెనక్కి పంపించారు. అయితే, ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇతర మతస్థులు శ్రీశైలంలో కలకలం సృష్టించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో భద్రతాపరమైన అంశాల్లో సీఎస్ఓ అయ్యన్న నిర్లక్ష్యంగా ఉన్నారని భావించిన ఈవో శ్రీనివాసరావు, ఆయనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఘటనపై తదుపరి విచారణ జరిపే అవకాశం ఉంది.



# అంజన్నను దర్శించుకున్న మాజీ ఎంపీ

**కలంజ్యోతి, మల్యాల :** మండలం ముత్యంపేట గ్రామంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీఆంజనేయ స్వామిని సోమవారం పార్లమెంట్ మాజీ సభ్యులు వినోద్ కుమార్ దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు శాలువాతో సత్కరించిన అనంతరం ఆలయ ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి వేదమంత్రాలతో ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, జెడ్పీ చైర్ పర్సన్స్ లు దావ వసంత సురేష్, తుల ఉమా, జనగాం శ్రీనివాస్, నర్సయ్య, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.




# మీ సంపూర్ణ సహకారంతోనే సేవా కార్యక్రమాలు

- బీటీఆర్ ఫౌండేషణ్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలలోని పెద కుటుంబాల ఆడబిడ్డల 500 పెళ్లి జంటలకు కల్యాణ కానుకగా రూ.60 లక్షల విలువైన మంచాలను అందజేసినందుకు.. బీటీఆర్ ఫౌండేషణ్ వ్యవస్థాపకులు బెంద్రం తిరుపతి రెడ్డిని లబ్ధిదారుల కుటుంబాలు, ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బెంద్రం తిరుపతిరెడ్డి మాట్లాడతూ.. ఇల్లంతకుంట మండల ఆడబిడ్డల వివాహాలకు కల్యాణ కానుకగా నిన్నటి వరకు 500 వివాహాలకు రూ. 60 లక్షల విలువైన మంచాలను ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. అన్ని గ్రామాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఇలా సహాయాలు చేయడం గ్రామాల్లో ఫౌండేషన్ సేవా ప్రతినిదులపై ప్రజల చూపే ఆదరాభిమానాలు వెలకట్టలేమన్నారు. సేవా ప్రతినిధుల, పాత్రికేయుల, యువత సమాచారాలతోనే ఈ 500 పెళ్లి జంటలకు మంచాలు అందించగలిగినమన్నారు. ఇలాగే మీ అందరి సంపూర్ణ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల వాసులు, పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.



## ఈటూరు బొడ్రాయి మహోత్సవంలో శాంతికల్యాణం

**కలంజ్యోతి :** నాగారం మండలం ఈటూరు అత్యంత వైభవోపేతంగా గ్రామస్తులంతా ఏకధాటిపై బొడ్రాయి (నాభి శిల) ప్రతిష్టాపనకు సోమవారం వైదికంగా బ్రహ్మశ్రీ కొండగడప హరిప్రసాద్ శర్మ పురోహితులు కాశీ లక్ష్మణ శర్మ ఆధ్వర్యంలో మూడో రోజు గణపతి పూజ, పుణ్యాహవాచనం బీజనాస్యం, యంత్ర స్థాపన నాభిశిలా ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట హోమము బలి పూర్ణాహుతి కుంబాభిషేకములు, శాంతి కల్యాణం ఆశీర్వచనం, గ్రామ దేవతకు పంచా బోనాలు, ధూప దీప నైవేద్యాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆచార్యులు శేషగిరి కాశివేణు శాస్త్రి గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

## కొండగట్టు హనుమాన్ పెద్ద జయంతికి 4.50లక్షల లడ్డూలు



**కలంజ్యోతి, మల్యాల :** కొండగట్టు హనుమాన్ పెద్ద జయంతి పురస్కరించుకొని లడ్డూలను అధికారులు అధిక సంఖ్యలో తయారు చేయించారు. పది రోజుల నుంచి రోజుకు 42,000 లడ్డూలకు గానూ 650 కేజీల నెయ్యి, 10 క్వింటాళ్ల శనగపిండి, 20 క్వింటాళ్ల చక్కెర, 75 కేజీల కాజు, 50 కేజీల కిస్మిస్, యాలకులు వాడినట్లు పేర్కొన్నారు. మొత్తం ఈ పెద్ద జయంతి 3 రోజుల ఉత్సవాలకు సుమారు 4 లక్షల 50 వేల తయారీలో లలితా సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



# హైదర్‌నగర్‌లో హైడ్రా కూల్చివేతలు

- ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల తొలగింపు
- మేడ్చల్ లో ఉద్రిక్తత
- భారీగా పోలీసుల మోహరింపు

**కలంజ్యోతి, హైదరాబాద్:** హైదరాబాద్ లో మరోసారి హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. హైదర్ నగర్ లో ఉద్రిక్తతల నడుమ హైడ్రా కూల్చివేతలు జరిగాయి. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. దాంతో స్థానికులు, హైడ్రా సిబ్బందికి వాగ్వాదం నెలకొంది. హైదర్‌నగర్ లో భారీగా పోలీసులు మోహరించారు. ప్లాట్ లోని యజమానులను కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు చేస్తోంది. దాదాపు 20 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదానికి హైడ్రా పరిష్కారం చూపినట్లు తెలుస్తోంది. తొమ్మిదిన్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 79 మంది ప్లాట్ల ఓనర్లు హైడ్రాకు మద్దతు తెలిపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా హైదర్ నగర్ లో ఈ స్థలాన్ని ఆక్రమించి పార్కింగ్ పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఓ ప్రైవేటు వ్యక్తి ఈ ఆక్రమణలకు పాల్పడటంతో ఆ స్థలం యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. దాదాపు 20 ఏళ్లుగా బాధితులు పోరాటం చేస్తున్నారు. చివరకు హైకోర్టు ఆదేశాలతో హైడ్రా రంగంలోకి దిగింది. ఈ భూమికి సంబంధించి ఎనిమిది నెలల క్రితమే తీర్పు వచ్చినప్పటికీ ప్రైవేటు వ్యక్తి ఖాళీ చేయకపోవడంతో హైడ్రా రంగ ప్రవేశం చేసి కూల్చివేతలు చేపట్టింది. హైదర్ నగర్ నుంచి మియాపూర్ వెళ్లే మార్గంలో కూల్చివేతలు కొనసాగుతున్నాయి. చుట్టూ షెడ్లను నిర్మించి అక్రమ పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఈ స్థలం అంతా కూడా హెచ్ఎమ్‌డీఏ లే అవుట్‌కు చెందినది. ఈ విషయాన్ని హైడ్రా నిర్ధారించింది. హైడ్రా చీఫ్ రంగనాథ్ హైదర్‌నగర్‌లో ఆక్రమణలకు గురైె స్థలం వద్దకు వచ్చి పరిశీలించారు. డాక్యుమెంట్లను పరిశీలించిన తర్వాత హైడ్రా సిబ్బంది నేరుగా కూల్చివేతలు చేపట్టింది. కూల్చివేతల సమయంలో ఈ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి హైడ్రా సిబ్బందిని అడ్డుకునేందుకు యత్నించాడు. అతడిని వెంటనే అదుపులోకి తీసుకుని కూల్చివేతలు కొనసాగిస్తున్నారు. హైడ్రాకు సంబంధించిన వందలాది మంది సిబ్బందితో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. జేసీబీల సహాయంతో పెద్ద ఎత్తున కూల్చివేతలు చేబడుతోంది.

# ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి

## నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**కలంజ్యోతి, నర్సంపేట :** రైతులు నష్ట పోకుండా ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం నర్సంపేట రైతు వేదికలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లతో నర్సంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ రబి కాలంలో నియోజకవర్గంలోని 6 మండలాల్లో అధిక వరి దిగుబడి వచ్చిందని, ఇప్పటివరకు 40 శాతం ధాన్యం కొనుగోలు చేసారని అన్నారు. క్షేత్ర స్థాయిలో మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి అధికారులు ధాన్యం నిలువ వివరాలు సేకరించి ,దాని ప్రకారం ప్రణాళికాబద్ధంగా లారీలను, హమాలీలను ఏర్పాటు చేసుకొని వేగవంతంగా మిల్లులకు తరలించాలని అన్నారు. రైస్ మిల్లర్లకు సామర్థ్యాన్ని బట్టి వెంటనే కేటాయింపులు చేయాలని అధికారులను ఆదేశించారు. కొంత మంది మిల్లర్లు కావాలని తరుగు పేరుతో రైతులను ఇబ్బం దులు పెడుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ట్రక్ షీట్ ప్రకారమే తీసుకోవాలని కోతలు విధిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. ఓపీఎం ఎస్ నమోదు వెంటనే చేయాలని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలను వెంటనే ఖాళీ చేసే ప్రయత్నం చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకూడదని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే నిర్దేశిత మిల్లులకు తరలించాలని తెలిపారు. అవసరమగు లారీలు సమకూర్చాలని జిల్లా రవాణా అధికారిను కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో అదనవు కలెక్టర్ సంధ్యా రాణి, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యా రాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఆర్డీఓ ఉమారాణి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక అతలాకుతలం

- భారీ వర్షా లకు నీట మునిగిన బెంగళూరు
- సహాయక చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- జేసీబీలో పర్యటించిన ఎమ్మెల్యే





**బెంగళూరు:** తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజులు పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రెండురోజులుగా కర్నాటకలో భారీ వర్షం కురుస్తోంది. బెంగళూరు నగరంలో ఈసీజన్‌లోనే అతిపెద్ద వర్ష పాతం నమోదైంది. దాంతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఈ క్రమంలో సహాయక చర్యలను పరిశీలించేందుకు వరద నీటిలోనే ఎమ్మెల్యే జేసీబీపై వెళ్లారు. కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నగరంలోని అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వరదలు వచ్చాయి. మాన్యత టెక్ పార్క్, హంపీనగర, కాటన్ పేట్, అంజనాపుర, బాగలకుంటె, జక్కూరు, హొరమావు, శెట్టిహళ్లి, విశ్వేశ్వరపురా, విద్యాపీఠ, హెమ్మిగెపురా, సిల్క్ బోర్డులో ప్రాంతాలు నీట మునిగాయి. బెంగళూరు రూరల్, కోలార్, చిక్కబళ్లాపూర్, రామనగర, మైసూరు, హాసన్,తుమకూరు మరియు ఇతర జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. యలహంక, ఆర్‌పురం, ఇతర ప్రాంతాల్లో నీరు ఇళ్లలోకి చేరడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**22 జిల్లాలకు ఎల్లో అలర్ట్**

బెంగళూరు సహా 22 జిల్లాలకు వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' ప్రకటించింది. మే 22 వరకు ఉడిపి, బెలగావి, ధారవాడ, గడగ్, హావేరి ప్రాంతాల్లో30-40 కిమీ వేగంతో ఈదురుగలులతో కూడిన తేలికపాటి నుంచిమోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. దాదాపు వారం రోజుల పాటు వర్షం కురిసే అవకాశంఉందని తెలిపింది. ఈ మేరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు ప్రయాణించ వద్దని సూచించింది.

# ఐదువేల లైసెన్స్‌డ్ సర్వేయర్లకు 10వేల దరఖాస్తులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఈ నెల 26 నుంచి 2నెలల పాటు సర్వే ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ
- రెండు రోజుల్లో మూడు గ్రామాల్లో విలేజ్ మ్యాప్‌ల డిజిటలైజేషన్ కు శ్రీకారం





**కలంజ్యోతి, హైదరాబాద్:** రష్ట్రంలో భూపరిపాలనను మరింత మెరుగుపరచడానికి ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించడం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ఇందిరమ్మ ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని రాష్ట హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాపును జతపరచడం తప్పనిసరి చేశామన్నారు. ఈ విధానాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకురావడానికి పెద్ద సంఖ్యలో సర్వేయర్ల అవసరాన్ని గుర్తించామన్నారు. ఇందుకోసం 5వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తుల ఆహ్వానించగా 10,031 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపైసోమవారం ఆయన హైదరాబాద్ లో సమీక్షించారు. ఈ సంర్భంగా మంత్రి మాట్లాడుతూ... లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 26వ తేదీ నుంచి గచ్చిబౌలి లోని సర్వే ట్రైనింగ్ అకాడమీలో రెండు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు భూ వివాదాలను పరిష్కరించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. డిజిటలైజేషన్ ఆఫ్ విలేజ్ మ్యాప్స్ టీజీఆర్ఏసీ (తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్) ద్వారా సర్వే రికార్డులను(మ్యాపులు) డిజిటలైజేషన్ చేపడుతన్నామని మంత్రి తెలిపారు. ప్రయోగాత్మకంగా నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని లింగాల గ్రామం, జగిత్యాల జిల్లా మాల్యాల మండలంలోని తక్కలపల్లి, ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి మూడు గ్రామాలలో ఈ ప్రక్రియను రెండు రోజుల్లో ప్రారంభించబోతున్నామని తెలిపారు. ఈడిజిటల్ మ్యాప్ లను ఎక్కడి నుండైనా సులభంగా యాక్సెస్ చేయొచ్చని, మాన్యువల్ పద్ధతుల కంటే వేగంగా, తక్కువ ఖర్చుతో ఖచ్చితమైన సమాచారం పొంద వచ్చన్నారు. డిజిటల్ మ్యాపింగ్ ద్వారా భూక్షేత్రాల పరిమాణం, ఆకృతి వంటి వివరాలు ఖచ్చితంగా పొందవచ్చన్నారు. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెరగడంతో పాటు మ్యుటేషన్ ప్రక్రియవేగవంతం అవుతుందన్నారు. పునరుద్ధరణ, భద్రత డిజిటల్ రూపంలో భద్రంగా నిల్వ చేయవచ్చు కాలానుగుణంగా అప్డేట్ చేయొచ్చు అని వివరించారు.



ఘనంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర-గోవిందమాంభ కళ్యాణం

**కలంజ్యోతి, నాగారం :** మండలం వర్ధమానుకోట గ్రామంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 30వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామిశ్రీ మాత గోవిందమాంభ కల్యాణం డప్పు వాయిద్యాల మధ్య వైభవంగా కళ్యాణ తంతును పౌరోహితులు గణేష్ శర్మ నిర్వహించారు. సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర గోవిందమాంభ లఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం 900 మంది కి అన్నదానం చేశారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర గోవిందమాంభ స్వామివార్లను గ్రామములో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమములో తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్సోజు చామంతి నరేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, దేవాలయ చైర్మన్ మేడోజు పోతులురాచారి, ఆకుల వెంకటయ్య, బొల్లు వీరయ్య, మేడోజు రామబ్రహ్మం, మేడోజు ఆంజనేయులు, ఆకుల శ్రీనివాస్, మామిడి సత్యనారాయణ, మేడోజు పోతులూరాచారి, బుర్రకథ బృందం సభ్యులు తదితర భక్తులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో ఒక్కరికి గాయాలు



**కలంజ్యోతి, నాగారం :** రోడ్డు ప్రమాదంలో ఒక్కరికి గాయాలైన సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలం నాగారం బంగ్లా గ్రామ శివారులోని సూర్యాపేట జనగాం జాతీయ 365బీ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన ప్రకారం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం ఇస్తలపురం గ్రామానికి చెందిన మున్న ప్రవీణ్ పల్సర్ 125 బైక్ పై తిరుమలగిరి వైపు వెళ్తూ అటువైపు వెళుతున్న లారీకి వెనుక భాగంలో వేగంగా ఢీకొట్టడంతో ఎడమ కన్ను భాగంలో బలమైన గాయం కావడంతో నాగారం మండల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి గాయపడిన వ్యక్తి (108) అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించినట్లు తెలిపారు.

కలంజ్యోతి
మంగళవారం 20.05.2025 General News




# సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

## జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

**కలంజ్యోతి, జగిత్యాల :** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ బి సత్యప్రసాద్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి పిర్యాదులు, వినతులను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడూ పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా.. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 43 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీఓలు మధు సుధన్, జివాకర్ రెడ్డి వివిధ జిల్లా అధికారులు, తహసీల్దర్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం లో పాల్గొన్న ఎర్రబెల్లి

**కలంజ్యోతి, మల్యాల :** జనగాం జిల్లా పాలకుర్తి మండలంలోని వల్మిడి గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయం నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తల్లి ఆశీస్సులు పొందారు.ఆలయ పరిసరాలను సందర్శించిన వారు ఆలయ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు.
ఈ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తల్లి దర్శనంతో ఆధ్యాత్మికానందాన్ని పొందారు. పూజారులు వేద మంత్రోచ్చారణలతో శోభాయమానంగా ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# నేటి నుంచి అంజన్నజయంతోత్సవాలు

- తరలిరానున్న హన్ మాన్ దీక్ష పరులు
- కాషాయమయం కానున్న కొండగట్టు
- ప్రత్యేక దర్శన ఇవ్వనున్న నరసింహ వక్రా ఆంజనేయుడు..





**నా తెలంగాణ, మల్యాల :** తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామికి ఏటా రెండుసార్లు జయంతి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఏటా చైత్ర పౌర్ణమి రోజు హనుమాన్ చిన్న జయంతిని వైశాఖ బహుళ దశమి పూర్వాభద్ర నక్షత్రం రోజున పెద్ద జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. కొండగట్టులో చిన్న జయంతి నుంచి పెద్ద జయంతి మధ్య 41 రోజుల వ్యవధి ఉంటుంది. ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించగా.. మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు పెద్ద జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు లక్ష మందికి పైగా హనుమాన్ దీక్ష స్వాములు కొండగట్టును తరలిరానున్నారు. అందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్ ఇప్పటికే జిల్లా అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. వేసవి ఎండలు మండిపోతున్న నేపథ్యంలో భక్తులు ఇబ్బంది పడకుండా చలవపందిళ్లు, మంచినీటి సౌకర్యం వంటి ఏర్పాటు చేస్తున్నారు.

**ఆలయ ప్రత్యేకత...**

జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి 15 కిలో మీటర్ల దూరంలోని జగిత్యాల -కరీంనగర్ జాతీయ రహదారికి రెండు కిలో మీటర్ల దూరంలో ఎత్తైన కొండలపై వెలసి కొండగట్టు ఆంజనేయ స్వామి కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తులు విశ్వసిస్తారు. దాదాపు అయిదు వందల ఏళ్ల కిందట కొడిమ్యాల పరగణాకు చెందిన సింగం సంజీవుడు ఆవులను మేపుతూ కొండగట్టు ప్రాంతంలోని గుట్టల్లోకి వెళ్లగా ఓ ఆవు తప్పిపోయింది. దానిని వెతికే క్రమంలో ఓ బండరాయిపై నిద్రలోకి జారుకోగా స్వప్నంలో ఆంజనేయ స్వామి ప్రత్యక్షమై ముళ్లపొదల్లో పడి ఉన్న తనకు గుడి నిర్మించాలని, ఆవు చెట్ల పొదల్లో ఉందని చెప్పి మాయమైనట్లు.. తర్వాత సంజీవుడు మేల్కొని ముళ్ల పొదల మధ్య ఉన్న స్వామివారి విగ్రహం వద్దకు వెళ్లగానే ఆవు ఎదురుగా వచ్చిందని, తర్వాత చిన్న గుడి నిర్మించినట్లు అర్చకులు, చరిత్రకారులు చెబుతుంటారు.

**నరసింహ వక్రాంతో ఆంజనేయుడు..**

కొండగట్టులో కొలువుదీరిన ఆంజనేయస్వామి ముకుళిత హస్తాలతో ఉత్తరం వైపు వెళ్తు న్నట్లు కనిపిస్తారు. విగ్రహం తలపై స్వామివారి పంచముఖాలలో ఒకటైన నారసింహుని ముఖం (వక్త్రం)తో దర్శనమివ్వడం మరో ప్రత్యేకత. ఆలయానికి దాదాపు అర కిలో మీటర్ల దూరంలోని లోయలోని మంచినీళ్ల బావి నుంచి జలాన్ని తీసుకొచ్చే నిత్యం ఉదయం, సాయంత్రం రెండు సార్లు స్వామివారికి అభిషేకం చేయడం మరో ప్రత్యేకత. ఎడమ వైపున జలబుగ్గ అనే ప్రాంతంలో మండు వేసవిలోనూ నీరు ప్రవహిస్తుంటుంది. స్వామివారి ప్రధాన ఆలయానికి కుడివైపున వేంకటేశ్వర స్వామి, ఎడమవైపున అమ్మవారి ఉపాలయాలు ఉన్నాయి. ఆలయానికి వెనుకవైపున క్షేత్రపాలకుడైన భేతాళుడి గుడి ఉంది. దాని పక్కనే ఎత్తైన బండరాళ్లపై కొండాల్రాయుడు అనే పరాక్రమవంతుడు శత్రువులకు చిక్కకుండా నివాసమున్నట్లు ఆనవాళ్లు కూడా ఉన్నాయి. మరికొంత దూరంలో కనిపించే గుహల్లో మునులు తపస్సు చేసినట్లు చెబుతారు. ఆలయానికి వెళ్లే దారి పక్కన సీతమ్మ కన్నీటి గుంతలు కనిపిస్తాయి.

**గుడికి చేరే మార్గం..**

కరీంనగర్ నుంచి దాదాపు 40 కిలో మీటర్ల దూరంలో దొంగలమర్రి నుంచి జేఎన్టీయూ కళాశాల మీదుగా ఆలయానికి చేరుకోవచ్చు. జగిత్యాల వైపు నుంచి వచ్చే భక్తులు 15 కిలో మీటర్ల దూరంలోని కొండగట్టు స్టేజీ నుంచి ఘాట్ రోడ్డు మీదుగా 2 కిలో మీటర్లు ప్రయాణించి ఆలయానికి చేరుకోవచ్చు. మెట్లదారిన ఆలయం వరకు నడచి వెళ్లవచ్చు. కరీంనగర్, జగిత్యాల నుంచి నిత్యం ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.

**ముడుపుపై విశ్వాసం..**

భక్తులు చాలా మంది సొంత వాహనాల్లో జేఎన్టీయూ మీదుగా కొండపైకి చేరుకుంటారు. ఇంట్లో ఒంట్లో బాగులేని వారు కొండగట్టు అంజన్నకు ముడుపు కడితే చాలు అంతా మంచే జరుగుతుందని భక్తులు ప్రగాఢ నమ్మకం. నమ్మకంతో నిత్యం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుంది. 'వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్ పెద్ద జయంతి' సందర్భంగా లక్షలాది మంది భక్తులు స్వామి వారి మాలను ధరించి దీక్షలు చేపడుతారు. ఈ సమయంలో కొండపైకి దీక్షపరులు చేరుకోవడంతో కొండగట్టు మొత్తం కాషాయమాయంగా మారుతుంది. స్వామి సన్నిధిలో దీక్ష స్వాములు మాల విరమణ చేస్తారు.

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలో కేంద్రంలో పచ్చిరొట్ట (జీలుగా) ఎరువు విత్తనాలు అయినా జీలుగా విత్తనాల పంపిణీలో భాగంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మల్యాలలో జిల్లా వ్యవసాయ అధికారి వి భాస్కర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే చంద్ర దీపక్ , పాక్స్ వైస్ ప్రెసిడెంట్ మ్యాక లక్ష్మణ్ , డైరెక్టర్లు గడ్డం రాజేశం, మాజీ ముత్యంపేట సర్పంచ్ బత్తిని శ్రీనివాస్, పాక్స్ సీఈఓ రుత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# భయపెట్టేందుకు వస్తున్న అనుష్క



మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' తర్వాత సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చిన అనుష్క.. క్రిష్ 'ఘాటీ'తో మళ్లీ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న 'ఘాటీ'.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలోనే మేకర్స్ రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటించనున్నారు. మరోవైపు ఓ మలయాళ చిత్రంలో కూడా స్వీటీ నటిస్తున్నారు. అనుష్క రీసెంట్‌గా ఓ దర్శకుడి కథకు ఓకే చెప్పారట. ఆ దర్శకుడెవరో కాదు.. హారర్ కామెడీ చిత్రాలను తెరకెక్కించడంలో మాస్టర్ గా పేరు గాంచిన సుందర్.సి. బెంజ్ మీడియా సంస్థతో కలిసి సుందర్.సి స్వీయ దర్శకత్వంలో ఈ సినిమాను నిర్మిస్తారట. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందే ఈ సినిమా.. హారర్ కామెడీ జానర్ లోనే ఉంటుందట.

## శరీరం సహకరించడం లేదు




ఒకప్పుడు తెలుగు సినిమల్లో కొన్ని వైవిధ్యమైన పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్నారు. సినిమాల కంటే ఎక్కువగా వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తుంటారు. పవన్ కల్యాణ్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌లను ఉద్దేశించి పరోక్షంగా ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు చర్చనీయాంశంగా మారాయి. తాజాగా పూనమ్ కౌర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలవడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఒక ప్రత్యేకమైన కానుకను అందజేశారు. అమరావతి అభివృద్ధిని ప్రతిబింబించేలా, కలల రాజధానిగా అమరావతి రూపుదిద్దుకుంటున్న తీరును వివరిస్తూ రూపొందించిన ఒక కళా కృతిని ఆమె చంద్రబాబుకు బహూకరించారు. కళ, కథనం, భావోద్వేగాల సమ్మేళనంగా ఉన్న ఆ ఆర్ట్ వర్క్‌ను సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. చాలా రోజుల తర్వాత ఈ కార్యక్రమంలో కనిపించిన పూనమ్ కౌర్, కాస్త బొద్దుగా, ఏదో అనారోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు కనిపించారు. దాంతో ఆమె ఆరోగ్యంపై సోషల్ మీడియాలో రకరకాల చర్చలు మొదలయ్యాయి. ఈ వార్తల నేపథ్యంలో పూనమ్ కౌర్ తన ఆరోగ్యం గురించి స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం తన ఆరోగ్యం అంత బాగా లేదని, ఫుడ్ అలర్జీతో బాధపడుతున్నానని ఆమె తెలిపారు. అంతేకాకుండా, ఫైబ్రోమయాల్జియా అనే వ్యాధితో తాను ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని పూనమ్ పేర్కొన్నారు. ఈ ఆరోగ్య సమస్యల కారణంగానే తన శరీరం ఉబ్బినట్లు కనిపిస్తోందని ఆమె వివరించారు. పూనమ్ వ్యాఖ్యల నేపథ్యంలో, ముందుగా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పలువురు నెటిజన్లు ఆమెకు సూచిస్తున్నారు.